నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 21 జనవరి 2025 | NIZAMABAD

కామారెడ్డిలో 'మాస్టర్ ప్లాన్' రద్దుపై రైతన్నలు పోరుబాట పట్టనున్నారు. రైతుల అభిప్రాయం మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేసింది. అయితే ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దీనిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి రైతులకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. కానీ ఇప్పటివరకు కాంగ్రెస్ పాలకుల నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో రైతుల్లో అనుమానాలు కలుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్‌ను తిరిగి తెర మీదికి తీసుకు వస్తారా? అనే సందేహాలు తలెత్తుతుండగా, దీనిపై స్థానిక ఎమ్మెల్యేలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నాడు రైతులను రెచ్చగొట్టి ఆందోళనలకు ఉసిగొల్పిన నాయకులంతా ఇప్పుడు వివిధ పదవుల్లో ఉండికూడా మాస్టర్ ప్లాన్ విషయంపై నోరు విప్పకపోవడం గమనార్హం.

–నిజామాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



మాస్టర్ ప్లాన్ రద్దుపై తాడోపేడో!

- ఆందోళనకు సిద్ధమవుతున్న కామారెడ్డి రైతులు
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ స్పందించని కాంగ్రెస్
- ఏడాదిగా తాత్సారం చేస్తున్న రేవంత్ సర్కార్ తీరుపై అనుమానాలు
- రైతన్న పోరుబాటపై నోరు మెదపని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు

భూమి ధర పడిపోయింది..

రామారెడ్డి, జనవరి 20: నాకు, మా అన్న య్యకు కలిపి పది ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మాకు ఆర్థికంగా ఇబ్బం దులు తలెత్తితే అమ్ముకుందామనుకున్నాం. అప్పుడు ఎకరం రూ.80 లక్షల నుంచి కోటి రూపాయల వరకు పలికింది. ఇప్పుడు మాస్టర్ ప్లాన్ అమలైదని చెప్ పడంతో అతి తక్కువ ధరకు పడిపోయింది. ప్రభుత్వం వెంటనే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలి. లేని పక్షంలో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నాం.

-గంగసాని సాగర్‌రెడ్డి, యువరైతు, అడ్లూర్ ఎల్లారెడ్డి

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

అసెంబ్లీ ఎన్నికల్లో మాస్టర్ ప్లాన్ రద్దుపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నీట మూటగానే మిగిలిపోయింది. దానిని ఇప్పుడు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. కామారెడ్డి పట్టణంలో వీలినమైన ఎనిమిది గ్రామాల రైతులందరం కలిసి మలి దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నాం.ఇందుకోసం రైతు ఐక్య కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం.

-బల్వంత్‌రావు, కామారెడ్డి విలీన గ్రామానికి చెందిన రైతు

రద్దుచేసే వరకు ఉద్యమిస్తాం..

వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న మాకు మాస్టర్ ప్లాన్ (ఇండస్ట్రియల్ జోన్) అంటూ భయపెడుతున్నారు. మేము బోర్ల సాయంతో ఏడాదికి రెండు పంటలను పం డించుకుంటున్నాం. వేల కుటుంబాలు ప్ర త్యక్షంగా, పరోక్షంగా జీవనం కొనసాగి స్తున్నాయి. అప్పటి నాయకులు నేడు ఉన్న త పదవుల్లో ఉన్నారు. వారు చొరవ తీసుకోవాలి. మాస్టర్ ప్లాన్ జీవోను రద్దు చేసేవరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

-జీర్ల మహిపాల్, యువ రైతు, అడ్లూర్ ఎల్లారెడ్డి

కామారెడ్డిలో మాస్టర్ రగడ మరో సారి ముదురుతున్నది. మున్సిపల్ అధికారుల తీరు మూలంగా పచ్చని పొలాలకు ఇబ్బందులకు తలెత్తకూడదని భావించి గత బీఆర్ఎస్ సర్కార్ మాస్టార్ ప్లాన్ ముసాయిదాను పక్కనబెట్టింది. కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేకంగా సమావేశమై మాస్టర్ ప్లాన్ రద్దుపై ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఏడాది క్రితం ప్రభుత్వం మారిన తర్వాత ఈ అంశంపై కాంగ్రెస్ పాలకులు మాట్లాడడంలేదు. గత సర్కారును ఇబ్బందికి గురిచేయాలనే తలంపుతో కాంగ్రెస్, బీజేపీ కలిసి అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన సమయంలో మాస్టర్ ప్లాన్‌పై ఉద్యమాలు చేశాయి. రైతుల్లో లేని పోని అపోహలను సృష్టించి రోడ్డు ఎక్కించాయి. ఇప్పుడవే పార్టీలు మిన్నకుండి పోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతున్నది. మాస్టర్ ప్లాన్ రద్దుపై స్పష్టతను కోరుతూ ఆందోళన చేసేం దుకు రైతులు సిద్ధమవుతుండడంతో ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పాలకులకు ముచ్చెమటలు పడుతు న్నాయి.

పట్టించుకోని రేవంత్ ప్రభుత్వం

కామారెడ్డి జిల్లాగా ఏర్పడిన తర్వాత పట్టణ రూపు రేఖలు మారిపోయాయి. బీఆర్ఎస్ సర్కారు హయాంలో కామారెడ్డి ఎంతో అభివృద్ధికి నోచు కున్నది. మెడికల్ కాలేజీ ఏర్పాటులోనూ కామా రెడ్డికి ప్రాధాన్యత దక్కింది. కేసీఆర్ పాలనలో నిర్మాణ రంగం జోరందుకోవడంతో కామారెడ్డి భారీగా విస్తరించింది. అయితే ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌లో పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాలైన అడ్లూర్ ఎల్లారెడ్డి, అడ్లూర్, టేక్రి యాల్, దేవునిపల్లి, లింగాపూర్, పాత రాజంపేట, సరంపల్లి, ఇల్చిపూర్ గ్రామాలను ఇండస్ట్రియల్ జోన్, గ్రీన్ జోన్‌గా గుర్తించారన్నది రైతుల వాదన. రైతుల అభిప్రాయం మేరకు బీఆర్ఎస్ సర్కారు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో పాటు ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ముసాయిదాను రద్దు చేసింది. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ వ్యవహారాన్ని గాలికొదిలేసింది. నాడు రైతులను రెచ్చగొట్టి ఆందోళనలకు ఉసిగొల్పిన వారంతా, ఇప్పుడు ఆయా పదవుల్లో ఉంటూ మాస్టర్ ప్లాన్ విష యంపై నోరు విప్పడం లేదు. దీంతో రైతులు మరోసారి పోరుబాట పట్టనున్నారు. మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు సదాశివనగర్ మండలం లోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులు ఐక్యకార్యాచ రణ కమిటీగా ఏర్పడి సమావేశం కావడంతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు పుడుతున్నది.

నాడు రైతులకు బాసటగా బీఆర్ఎస్

కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో రైతులను కంటికి రెప్పలా చూసుకున్నది. ఎన్నో అనుకూల నిర్ణయాలు, పథకాలను ప్రకటించి దేశ వ్యాప్తంగా గుర్తింపును తెచ్చుకున్నది. 2021 మార్చి 27న కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసిన విధంగా మాస్టర్ ప్లాన్ ముసాయిదా లేకపోవ డంపై గందరగోళం చోటు చేసుకున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి తప్పులను సరిచేసింది. ప్రభు త్వానికి చేరిన డ్రాఫ్ట్‌కు, కౌన్సిల్‌లో చర్చించిన ముసాయిదాకు మధ్య వైరుధ్యం ఉండడంతో మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని సర్కారు నిర్ణయిం చింది. ఢిల్లీకి చెందిన డిజైన్ డెవలప్‌మెంట్ ఫోరం తోపాటు డీటీసీపీ జాయింట్ డైరెక్టర్ రమేశ్ బాబు కారణమని తేల్చి వారిపై చర్యలకు ఉపక్రమిం చింది. రైతులకు ఎంతోమేలు చేసినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరించి బీఆర్ఎస్ సర్కారుపై బురదజల్లే ప్రయత్నానికి ప్రయత్నించాయి. గత ప్రభుత్వం రద్దు చేసిన మాస్టర్ ప్లాన్ అంశంపై రైతుల్లో ఇప్పుడు మరో సారి అనుమానాలు కలుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనతో కామారెడ్డి, ఎల్లారెడ్డి నియో జకవర్గాల్లోని రైతులకు అనేక ఇబ్బందులు తలెత్తు తాయి. ఈ రెండు ప్రాంతాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యే లుగా కాటిపల్లి వెంకట రమణారెడ్డి, మదన్ మోహన్‌రావు ఉన్నారు. వీరిద్దరూ ఇప్పుడు ఈ సమస్యపై స్పష్టత ఇవ్వడం లేదు. రైతులు ఆందో ళన చేస్తున్నా వారితో మాట్లాడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కామారెడ్డి రైతులు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతుండడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

ఏదో ఒకటి తేల్చుకుంటాం..

'మాస్టర్ ప్లాన్' బాధిత గ్రామాల రైతులు

కామారెడ్డి, జనవరి 20 : మాస్టర్ ప్లాన్ రద్దు జీవోపై ఏదో ఒకటి తేల్చుకోవాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ స్పష్టం చేసింది. సోమ వారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రి యాల్ గ్రామంలో రైతు ఐక్యకార్యాచణ కమిటీ ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ బాధిత గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వస్తే మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తా మని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని నిలబె ట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మె ల్యేలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.

టేక్రియాల్‌లో సమావేశమైన రైతులు

- అందుకే కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని బహిష్కరిస్తున్నా..
- జిల్లా కలెక్టర్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల లేఖ

తులం బంగారమిస్తమని.. సీఎం మాట తప్పిండు!

మోర్తాడ్, జనవరి 20: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలేదంటూ మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నిరసన వ్యక్తంచేశారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కు లతో పాటు తులం బంగారం ఇస్తామని సీఎం ఇచ్చిన మాట తప్పినందుకు ఈదఫా చెక్కు ల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నానంటూ కలెక్ట ర్‌కు లేఖ రాసి, ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేశారు.

జిల్లా కలెక్టర్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల రాసిన లేఖ

లేఖలోని వివరాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష రూపాయల చెక్కుతోపాటు తులం బంగారం కూడా ఇస్తానని రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదిమీద నెలరోజులు గడి చినా ఇప్పటికీ తులం బంగారం ఇవ్వక మాట తప్పినందుకు నిర సనగా చెక్కుల పంపిణీ కార్యక్ర మాన్ని బహిష్కరిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈదఫా వచ్చిన చెక్కులను ఆయా గ్రామాల పంచాయతీ కార్యద ర్శుల ద్వారా గ్రామంలోనే నేరుగా లబ్ధిదారులకు అందజే యాలని సూచించారు. ఇప్పటి కైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం వెంటనే తులం బంగారం పథకాన్ని మొదలుపె ట్టాలని, ప్రభు త్వం ఏర్పడిన రోజు నుంచి ఇప్పటి వరకు కల్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులందరికీ కూడా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలి పారు.

పసుపుబోర్డు ఏర్పాటుకు కవిత కృషి

- బీజేపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్‌కేవీ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌కేవీ నాయకురాలు విజయలక్ష్మి

ఖలీల్‌వాడి, జనవరి 20 : కవిత ఎంపీగా ఉన్న ప్పుడు పసుపుబోర్డు ఏర్పాటు కోసం ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్‌కేవీ జిల్లా కార్యదర్శి విజయ లక్ష్మి అన్నారు. ఆమెపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొ న్నారు. సోమవారం ఆమె జిల్లా కేంద్రంలో విలే కరుల సమావేశంలో మాట్లాడారు. 2014 లో ఎంపీగా గెలిచిన కవిత జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. ఎన్నో అభి వృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆమెకే దక్కు తుందన్నారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని ప్రధానితో రెండుసార్లు భేటీ అయి మాట్లాడారని గుర్తుచేశారు. అప్పుడు అర్వింద్ ఎక్కడ ఉన్నాడని, ఓ గల్లీ నుంచి కూత కూస్తున్న బీజేపీ నాయకులు ఎక్కడ అంటూ మండిపడ్డారు. కవిత గురించి మాట్లాడేటప్పుడు నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలని సూచించారు. బీజే పీ నాయకురాలు స్రవంతి ఏదో పోస్ట్ ఇస్తా రని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, మాట లు జాగ్రత్త ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ప్రతినిధులు జయలక్ష్మి, లత, సావిత్రి, ప్రసాద్, శేఖర్‌రెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 20 : గణతంత్ర దినోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడు కలకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా వేడుకలు అట్టహాసంగా జరిగేలా అధి కారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిం చేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్థవం తంగా విధులు నిర్వర్తించిన సిబ్బందికి ప్రాధాన్యమిస్తూ ఈనెల 22లోగా పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫారసు చేయాలని అన్నారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్ర మాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలె క్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏవో ప్రశాంత్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- ఉద్యానవనంలో ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు!
- కాలి బూడిదైన పండ్ల తోటలు, డ్రిప్, సామగ్రి
- లక్షల రూపాయల్లో నష్టం

'మాల్తుమ్మెద క్షేత్రం'లో అగ్నిప్రమాదం

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నాగిరెడ్డిపేట, జనవరి 20: మాల్తుమ్మెద అంటుమొక్కల, ఉద్యాన వనక్షేత్రంలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరి గింది. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు మామిడి తోటలకు అంటు కొని క్షేత్రంలోని సగభాగం బుగ్గిపాల య్యింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి అక్కడికి చేరుకొని ఎల్లారెడ్డి, మెదక్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. క్షేత్రం అధికారులెవరూ లేకపోవ డంతో..దినసరి కూలీ సాయంతో సహా యక చర్యలు చేపట్టారు.మామిడి తోటలు, జామా, ఉసిరి తోటలు, గ్రీన్ నెట్ షెడ్, డ్రిప్ పరికరాలు, పైల్‌లైన్లు, బోరు మోటర్లు బుగ్గిపాలయ్యాయి. మిగతా సగం క్షేత్రాన్ని కాపాడేందుకు ఎల్లారెడ్డి అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఎట్టకేలకు మంటలు అదుపులోకి వచ్చినట్లు తెలి పారు. క్షేత్రం పూర్తి స్థాయిలో కాలిపోతే రూ.కోట్ల విలువైన సంపద బుగ్గిపాలు అయ్యేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రంలోని గడ్డి, పండ్ల తోటల ఆకులను ఏడాదికాలంగా తొలగించక పోవడం, అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా క్షేత్రం నేడు దుస్థితి వచ్చిం దని మండిపడ్డారు.

ఆర్టీసీ 'స్పెషల్' బాదుడు

- ప్రయాణికుడి జేబుకు చిల్లు.. సంస్థకు ఆదాయం పుల్లు
- పండుగ పూర్తయినా అదనపు బస్సుచార్జి వసూలు

లింగంపేట, జనవరి20: పండుగ పూర్తయినా ప్రయాణికులను ఆర్టీసీ వదలడంలేదు. స్పెషల్ పేరిట బస్సు చార్జీలను వసూలు చేస్తున్నది. కామా రెడ్డి డిపో పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి రూట్లో ఇటీవల ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ప్రారంభించారు. కామారెడ్డి నుంచి లింగంపేటకు టికెట్ ధర 50 రూపాయలుగా నిర్ణయించారు. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో పండుగకు ఇంటికి వచ్చిన విద్యార్థులు తిరుగు ప్రయాణమవుతున్నారు. స్వగ్రామాలకు వచ్చిన ఉద్యోగులు కూడా విధులు నిర్వహించే ప్రాంతా లకు తరలివెళ్తున్నారు. సోమవారం కామారెడ్డి, ఎల్లారెడ్డి రూట్లో నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సులో పది రూపాయలు అదనంగా చార్జి వసూలు చేశారు.

కామారెడ్డి, లింగంపేట రూట్‌లో బస్సుచార్జీల్లో వ్యత్యాసం

టికెట్ ధర రూ.50 ఉండగా, రూ. 60 వసూలు చేశారు. కామారెడ్డి నుంచి లింగంపేటకు వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సుకు సరిపడా డబ్బులు లేకపోవడంతో తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామ రహదారిపై మార్గమధ్యంలో దించివేశారు. స్పెషల్ బాదుడుపై ప్రయాణికులు మండిపడ్డారు. ఆర్టీసీ అధికారులు తీరుపై నిరసన వ్యక్తంచేశారు. 'స్పెషల్' బాదుడుతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడగా, ఆర్టీసీకి మాత్రం భారీగా ఆదాయం చేకూరింది.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

ఇలాగైతే కాలేజీలను నడపలేం..

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- కలెక్టర్‌కు ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల వినతి

కంఠేశ్వర్, జనవరి 20 : మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయకపోతే, కళాశాలల నిర్వహణ సాధ్యం కాదని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆ ధ్వర్యంలో సోమవారం రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లా డుతూ.. వేల మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పినా, తమకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో జాప్యం చేయడం తగదన్నారు. ఏడాది నుంచి సిబ్బంది జీత భత్యాలు, కళాశాల భవనాల అద్దెలు కూడా చెల్లిం చలేని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. ప్రైవేట్‌డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి సంజీవ్, ప్రతినిధులు సూర్యప్రకాశ్, నరాల సుధాకర్, శ్రీనివాస్, అరుణ్, రమణ, నవీన్, రవిపటేల్, షేక్ రషీద్, గంగాధర్ పాల్గొన్నారు.